క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్‌భాస్కర్ ప్రకటించారు. వైఎంసీఏ ఫీడర్ పరిధి నారాయణగూడ బ్లడ్‌బ్యాంక్, లింగంపల్లి వాటర్‌వర్క్స్, రాఘవేంద్ర స్వామి టెంపుల్, పోలీస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో 9.30 నుంచి 11.30 వరకు, బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలో వైశ్యాహాస్టల్, వెంకట్రమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాలలో 11.30 నుంచి 1.30 వరకు, విద్యానగర్ ఫీడర్ పరిధిలో అడిక్‌మెట్, బ్లడ్‌బ్యాంక్, వడ్డెరబస్తీ, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో 2.30 నుంచి 5గంటల వరకు, డీడీహెచ్ ఫీడర్ పరిధి విజ్ఞాన్‌పూర్‌కాలనీ, దయానంద్‌నగర్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో 3 గంటల నుంచి 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు !



అంబర్‌పేట: డివిజన్‌లో ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించాలని బాగ్‌అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. బుధవారం తురాబ్‌నగర్‌లో ఉన్న ప్రమాదకర విద్యుత్ స్తంభాలను ఆమె గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పాత స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, జగన్, రమేష్, శ్రావణ్ తదితరులున్నారు.

బదిలీలు.. బాధ్యతల స్వీకరణ



ముషీరాబాద్: నియోజకవర్గంలో పనిచేస్తున్న ఇద్దరు జీహెచ్ఎంసీ ఏఈలు బదిలీ కాగా వారి స్థానంలో కొత్త ఏఈలు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు భోలక్‌పూర్, కవాడిగూడ డివిజన్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతి గాజుల రామారం డివిజన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో కూకట్‌పల్లి డివిజన్ నుంచి వచ్చిన సుభాష్ బాధ్యతలను స్వీకరించారు. గాంధీనగర్ డివిజన్ ఏఈగా పనిచేస్తున్న శ్రావణి బదిలీపై కూకట్‌పల్లికి వెళ్లగా ఆమె స్థానంలో సలామ్ ఏఈగా బాధ్యతలు తీసుకున్నారు.

బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతా సిన్హా

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కాంట్రాక్ట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ కార్మిక వర్గాన్ని దోచుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించాలని ప్రొఫెసర్ శాంతా సిన్హా పిలుపునిచ్చారు. బుధవారం సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదని విమర్శించారు. కేజీబీవీ మహిళా వర్కర్స్ పట్ల సానుకూలంగా వ్యవహరించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలకార్మికుల నిర్మూలనకు కేజీబీవీలు కృషి చేస్తున్నాయన్నారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జనార్దన్, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ ఉపాధ్యక్షులు అరుణ, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గంటా నాగయ్య, ప్రధాన కార్యదర్శి గీత, అమృత, ఎల్లమ్మ తదితరులున్నారు.

ప్రొఫెసర్ కోదండరామ్ దీక్షకు సంఘీభావం



చిక్కడపల్లి: కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ దీక్షకు ఆ పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దీక్షలో కోదండరామ్‌ను బుధవారం ఆ పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ రవీందర్‌యాదవ్, నాయకులు అజయ్‌గౌడ్ తదితరులు కలిసి దీక్షకు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా మనకు దక్కాల్సిన నీటి వాటాను దొడ్డిదారిన పక్క రాష్ట్రం వారు దోచుకుపోతున్నారని మండిపడ్డారు.

తాగునీటికి కటకట.. !

- వేసవి రాకముందే విద్యానగర్‌లో నీటి కష్టాలు
- ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు



విద్యానగర్‌లో నీటి సమస్యలపై ఆందోళన చేస్తున్న ప్రజలు

నియోజకవర్గంలో వేసవిలో తాగునీటి కొరత లేకుండా చేస్తామని ప్రకటించిన ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తాగునీటి ఎద్దడి లేని సమయంలోనే విద్యానగర్‌లో ప్రజలు నీటి కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది.

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్‌లోని వీధి నెంబర్–6, 7 మధ్యలో అరుణోదయ అపార్ట్‌మెంట్ గల్లీ, రెడ్‌క్రాస్ సొసైటీ సమీపంలోని బ్రహ్మంగారి టెంపుల్, మార్క్స్ భవన్ తదితర ప్రాంతాల్లో గతనెల రోజులుగా తాగునీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చిందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇష్టానుసారంగా నీటి సరఫరా..

- తాగునీటి సరఫరాను ఒకే సమయంలో కాకుండా ఇష్టానుసారంగా సరఫరా ద్వారా లోప్రెషర్ కారణంగా ప్రజలకు ఆ నీరు సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని ఇళ్లల్లో పైపుల ద్వారా ఒక్క నీటి చుక్క కూడా రాకపోవడంతో వారు ఏకంగా ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నారు.

దారుణంగా అద్దె ఇళ్ల పరిస్థితి..

- అద్దెకు ఉంటున్న చాలా మందికి తాగునీరు అందకపోవడంతో కొంత మంది మోటర్లను బిగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మోటర్లు బిగించినా నీటి సరఫరాలో పెద్దగా వ్యత్యాసం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

డ్రైనేజీ సమస్యతో సతమతం..

- అరుణోదయ అపార్ట్‌మెంట్ గల్లీలో నిత్యం డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరుణోదయ అపార్ట్‌మెంట్ నుంచి ఓ మ్యాన్‌హోల్ లీకేజీ కారణంగా గల్లీలోని ఇళ్ల ముందు నుంచి మురుగు ప్రవహిస్తుండటంతో స్థానికులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు.
- ఈ పరిస్థితిపై అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే జలమండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరించారు.

కొత్త పైప్‌లైన్ వేసినా మారని పరిస్థితి..



గత కొద్ది రోజులుగా పాతపైపుల కారణంగా లోప్రెషర్‌తో తాగునీరు సరఫరా కావడం లేదని సుమారు రూ.లక్ష వెచ్చించి కొత్త పైపులైన్ వేసుకున్నా.. నీటి సరఫరాలో ఎలాంటి మార్పులేదు. లోప్రెషర్‌తో మా కుటుంబసభ్యులకు నీరు ఏమాత్రం సరిపోవడంలేదు. తాగునీటి కోసం బయటి నుంచి వాటర్ క్యాన్‌లను కొనాల్సిన పరిస్థితి నెలకొంది.

– శైలజ, స్థానికురాలు

ఇంటి ముందే దుర్గంధం..



అసలే తాగునీరు సరఫరా కావడంలేదని బాధ పడుతుంటే మరోవైపు మా గల్లీలోని డ్రైనేజీ సమస్య ఇళ్లు వదిలేలా చేస్తోంది. ఉదయం సాయంత్రం వేళల్లో ఇంటి ముందే డ్రైనేజీ, మురుగు ప్రవహిస్తుండటంతో దుర్గంధానికి అన్నం కూడా తినలేకపోతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్యే మా సమస్యపై స్పందించి పరిష్కరించాలి.

– మాధవి, స్థానికురాలు

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జర భద్రం !

చిక్కడపల్లి: సంక్రాంతికి ఊర్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సంజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..

- విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో పెట్టాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు.
- ఇంటిలోపల ఒక లైట్‌ను వేసి ఉంచడంతో పాటు తాళం కనిపించకుండా గుమ్మాలకు కర్టెన్స్ వేయాలని సూచించారు.
- తమ వ్యక్తిగత వాహనాలను ఇంటి ఆవరణలోనే సురక్షిత ప్రాంతాల్లో పెట్టి పక్కాగా తాళం వేసి జాగ్రత్త పడాలన్నారు.
- విలువైన ధ్రువీకరణ తదితర పత్రాలను తమ వాహనంలో పెట్టకూడదని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఇంటికి నాణ్యమైన సీసీ కెమెరాలు అమర్చుకుని ఆన్‌లైన్ సౌకర్యంతో పాటు మొబైల్ ఫోన్‌కి అనుసంధానం చేసుకోవాలన్నారు.
- నాణ్యతతో కూడిన తాళాలను మాత్రమే (ఉదా గోద్రెజ్) వాడాలని, లోపలి రూమ్‌లకు కూడా తాళాలు వేయాలని పేర్కొన్నారు.
- అల్మారాలకు తాళం వేసి తాళం చెవులను తమ వెంట తీసుకెళ్లాలని ఇంట్లో విలువైనవేవి ఉంచకూడదని తెలిపారు.
- ఇంట్లో ఉన్న అన్ని కిటికీల తలుపులను జాగ్రత్తగా వేసి ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలన్నారు. ఇంట్లోకి పని మనుషులు పాలు, పేపర్, వారిని రావొద్దని చెప్పాలన్నారు.
- లాక్ హౌస్ సమాచారాన్ని సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విలువైన వస్తువుల సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని సూచించారు.
- నమ్మకమైన వాచ్‌మెన్‌ను మాత్రమే నియమించుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్ నంబర్‌కు సంబంధించిన పోలీస్ అధికారులు బీట్ కానిస్టేబుల్ నంబర్‌ను తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎదైనా సంఘటన జరిగినప్పుడు 100 నంబరు లేదా 8712660160, 8712660168 నంబర్లకు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

సంక్రాంతి వేడుకలు



అంబర్‌పేట: సంక్రాంతి సంబరాలతో చిన్నారులు భోగిమంటలు, హరిదాసు వేషధారణలో ఆకట్టుకున్నారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట్‌లోని నిత్య పాఠశాలలో విద్యార్థులు సందడిగా సంక్రాంతి పండుగను నిర్వహించుకున్నారు. ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ జయలక్ష్మి, ఉపాధ్యాయులు సుజాత, గాయత్రి, కళ్యాణి, శ్వేత విద్యార్థులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దాయారం మార్కెట్ జోన్ న్యూ అభయ సెంట్రింగ్ అండ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 2023 నూతన కేలండర్‌ను బుధవారం యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. చైర్మన్ వాసుదేవ్, వైస్‌చైర్మన్ యాదగిరి, అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి షమీన్, కోశాధికారి సదానంద్, వైస్ ప్రెసిడెంట్ నర్సింహ, జాయింట్ సెక్రటరీ నారాయణ, రాములు తదితరులున్నారు.

'గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలి'

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిన్న జరిగిన తమిళనాడు అసెంబ్లీ సమావేశం వరకు రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు గవర్నర్ వ్యవస్థను వాడుకుంటున్నారని విమర్శించారు. శాసనసభ సమావేశాన్ని గవర్నర్ బహిష్కరించి వెళ్లడం సరికాదన్నారు.

నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని వినతి



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ అరుణోదయ కాలనీలో నూతన సివరేజ్ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని జలమండలి ఎండీ దానకిషోర్, డైరెక్టర్ కృష్ణను అరుణోదయ కాలనీవాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ రాసిన లేఖను కో– ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కాలనీ అధ్యక్షుడు దానియల్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, వీరేందర్, విశ్వనాథ్, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండా శ్రీధర్‌రెడ్డి, మహంకాళి ఆలయ చైర్మన్ రాజు, శివాలయం చైర్మన్ శ్రీధర్‌చారి, నాయకులు శివముదిరాజ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

గీతాపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా భిక్షపతిగౌడ్



ముషీరాబాద్: ఉత్కంఠ భరితంగా జరిగిన గీతాపారిశ్రామిక సహకార సంఘం (రాంనగర్) ఎన్నికల్లో అధ్యక్షుడిగా భిక్షపతిగౌడ్ ఎన్నికయ్యారు. బుధవారం రాంనగర్‌లో గీతాపారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల్లో భిక్షపతి ప్యానల్, సురేష్‌గౌడ్ ప్యానల్‌లు పోటీపడ్డాయి. మొత్తం 33 మంది సభ్యులకు 32 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కో–ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్ సిద్ధిరాములు సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో భిక్షపతి ప్యానల్‌కు 21మంది, సురేష్‌గౌడ్‌కు 11మంది సభ్యులు మద్దతు పలికారు. 10 ఓట్ల మెజార్టీతో భిక్షపతి ప్యానల్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

నూతన కార్యవర్గం..

అధ్యక్షుడిగా భిక్షపతిగౌడ్, డైరెక్టర్లుగా వేణుబాబుగౌడ్, సత్యనారాయణగౌడ్, మహేష్‌గౌడ్, నర్సింహగౌడ్‌లు ఎన్నికయ్యారు. అనంతరం లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్‌తో పాటు పలువురు నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. వీరి పదవీకాలం 5 ఏళ్లు ఉంటుంది.

దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం



లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం



ముషీరాబాద్: లాల్‌బహదూర్ శాస్త్రీ వర్ధంతి సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించి ప్రధానిగా సేవలు అందించి జై జవాన్, జై కిసాన్ నినాదంతో ప్రజలను చైతన్య పరిచారన్నారు.

సన్మానం..

- ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా హైదరాబాద్ గాంధీభవన్‌కు వచ్చిన మాణిక్‌రావుఠాక్రేను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్ ముదిరాజ్ కలిసి శుభాకాంక్షలు తెలిపి అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు.

క్రైం కార్నర్

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

అంబర్‌పేట: ఆటో ఢీకొని ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ ప్రభాకర్ తెలిపిన ప్రకారం.. జిందాతిలిస్మాత్ ప్రాంతంలో నివసించే నర్సింహాచారి(68) ఈ నెల 8న రోడ్డు దాటుతున్న సమయంలో గోల్నాకు వెళ్తున్న ఆటో (టీఎస్15యూసీ0622) ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలకు బీఆర్ఎస్ మరింత కృషి



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో బీఆర్ఎస్ మరింత కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా బుధవారం మానసిక వికలాంగుల ఆశ్రమంలో 500 మందికి ఆహారం, కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, ఎంఎస్ఎస్ఓ చైర్మన్ రోహిత్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహలతో కలిసి ప్రారంభించారు. పలువురికి ఆర్థిక సహాయం అందజేసి నిరాశ్రయులకు ట్రస్ట్ ద్వారా సేవాలందించడం మంచి పరిణామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, గజ్జల నగేశ్, శ్రీనివాస్‌రావు, సినీనటుడు విశ్వ, బీఆర్ఎస్ నాయకులు రాకేశ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా, జగదీశ్‌బాబు, సత్యనారాయణ, రవి శంకర్‌గుప్తా, భాస్కర్, రవి, వినయ్, శివ, తదితరులున్నారు.

సమాజాభివృద్ధికి సేవాసంస్థలు కృషి చేయాలి..



ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర తదితరులు

చిక్కడపల్లి: స్వచ్ఛంద సేవాసంస్థలు సమాజంలోని ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలను చేపట్టాలని అప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ వసుంధర అన్నారు. వైజ్‌మెన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ 65 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా క్లబ్ బుధవారం చిక్కడపల్లిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనాథలు, నిరాశ్రయులకు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవలందిస్తూ జంటనగరాల్లో ఈ క్లబ్ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. వైజ్‌మెన్ సంస్థల వ్యవస్థాపక ప్రముఖులు నరసింహారావు సామాజిక సేవ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా క్లబ్ రూపొందించిన బాలికలకు విలువలతో కూడిన విద్య ప్రత్యేక పోస్టర్‌ను హైదరాబాద్ విస్తార క్లబ్ అధ్యక్షురాలు కామిశెట్టి గోదాలక్ష్మితో కలసి ఆవిష్కరించారు. చైతన్యపురి అధ్యక్షులు విశాలక్ష్మి, నారాయణరావు, వినయ్ స్వరూప్, ప్రిసిలీగయాస్, కుసుమకుమారీ పాల్గొన్నారు.

సరస్వతి సంగీత విద్యాలయ వార్షికోత్సవం



నల్లకుంట: వేద సంక్షిప్తమైనదే శాస్త్రీయ సంగీతమని టీవీ దర్శక, నిర్మాత శోభాశంకర్ అన్నారు. ఏ దేశానికి వెళ్లినా సంగీతమంటే సాధన అని భారత దేశంలో మాత్రం సంగీతమంటే ఆరాధన అని చెప్పారు. శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం బాగ్ అంబర్‌పేట్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయం ధ్యాన మందిరంలో త్యాగరాజస్వామి ఆరాధన, సంగీత విద్యాలయం 67వ వార్షికోత్సవం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా శోభాశంకర్ హాజరై మాట్లాడారు. త్యాగరాజ స్వామి కీర్తనలు భక్తితో పాటు ముక్తిని ప్రసాదిస్తాయన్నారు. ఈ సందర్భంగా పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మచే నిర్వహించిన పంచరత్న కీర్తనల గోష్ఠిగానం, ప్రముఖ వీణా విద్వాంసురాలు శాంతా కుమారి బృందంచే నిర్వహించిన గానం ఆకట్టుకుంది. వయోలిన్‌పై అచ్యుతరావు, మృదంగంపై దుర్గారావు, ఘటంపై మల్లికార్జున్ వాద్య సహకారం అందించారు. సంగీత విద్యాలయం అధ్యాపకులు యశస్విని, తేజస్విని తదితరులు పాల్గొనగా సంగీత విద్యాలయంలో నిర్వహించిన పరీక్షకు హాజరైన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ముషీరాబాద్: భారతదేశ స్వాతంత్ర్య పోరాట యోధులు, ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి కుడి భుజంగా ఉండి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు వడ్డె ఓబన్న అని అడిక్‌మెట్ వడ్డెర సంఘం అధ్యక్షులు కుంచపు శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని వడ్డెర బస్తీలో వడ్డె ఓబన్న 216వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరయ్యారు. వడ్డెర సంఘం ప్రధాన కార్యదర్శి దుండుగుల వెంకటేష్, సాయిలు, శంకర్, రాంబాబు, సంజయ్, అరుణ్, కృష్ణ, సాయికుమార్, సాయి, రమేష్, ఎల్లయ్య, బీఆర్ఎస్ నాయకులు మాధవ్, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, రాజు తదితరులున్నారు.

ఎట్టకేలకు ప్రారంభమైన అభివృద్ధి పనులు



మాధవరావులైన్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని గాంధీనగర్ మాధవరావులైన్ ఏరియాలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కానున్నాయి. శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ పైప్‌లైన్ వేసిన తర్వాతే డీసీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని వాటర్‌బోర్డు నుంచి ప్రతిపాదనలు రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి. దీంతో డ్రైనేజీ లైన్ ఏర్పాటు కోసం రూ.59 లక్షలు మంజూరు కాగా.. టెండరింగ్ పనులను ప్రారంభించకపోవడంతో వరదనీరు, డ్రైనేజీ నీరు గుంతల్లో చేరి స్థానికులు నానా ఇబ్బందులు పడ్డారని కార్పొరేటర్ తెలిపారు. 10 సార్లు వాటర్‌బోర్డు కార్యాలయానికి తిరిగి రెండుసార్లు స్థానికులను కూడా తీసుకెళ్లామన్నారు. ఎట్టకేలకు 6 నెలలుగా స్థానిక కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వాటర్‌బోర్డు ఎండీ దానకిషోర్ దృష్టికి తీసుకెళ్లడంతో మూడు రోజుల్లో పనులు ప్రారంభం కానున్నాయి.

- ఈ సందర్భంగా బుధవారం ఆమె వాటర్ బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, స్థానికులతో కలిసి పర్యటించి డ్రైనేజీ లైన్ పనుల ఏర్పాటుపై సమీక్షించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేయనునన్నట్లు ప్రకటించారు. నగర బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నవీన్, శ్రీను, సాయి, ప్రశాంత్, నవీన్‌కుమార్, స్థానికులు శ్రీనివాస్, రమేష్, సంజయ్, బ్రహ్మం, శోభన్ బాబు, కొలాయిరెడ్డి తదితరులున్నారు.

కంటివెలుగు సెంటర్లను ఏర్పాటు చేయాలి



అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయబోతున్న కంటి వెలుగు పథకం అమలుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో కంటిపరీక్షల కోసం ఏర్పాటు చేసే సెంటర్లను గుర్తించి అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. బుధవారం ఆయన జీహెచ్ఎంసీ సర్కిల్–15 డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ, ఎ.ఎం.హెచ్.ఓ. మైత్రేయి, వైద్యశాఖ అధికారులతో కలిసి అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్ నిర్వహణను అధికారులు సరిగ్గా పట్టించుకోకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో కంటి వెలుగు సెంటర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ ఏఈ మురళీ, బీఆర్ఎస్ పార్టీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, శ్యామ్‌సుందర్, మాధవ్, రవియాదవ్, ప్రభాకర్, రాజు తదితరులున్నారు.